# ప్రజల సహకారంతో చెత్తరహిత సైబరాబాద్ దిశగా అడుగులు

## అంజనేయ నగర్‌లో సీఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు


సిఎంసి పరిధిలో పర్యటిస్తున్న కమిషనర్ సృజన

సైబరాబాద్:బిఎన్ఎస్): సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ జోనల్ కమిషనర్‌తో కలిసి అంజనేయ నగర్‌లో పారిశుద్ధ్య నిర్వహణ, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల నిర్మూలన, ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న పరిశుభ్రత కార్యక్రమాలను బుధవారం పరిశీలించారు.అంజనేయ నగర్ ఎక్స్‌రోడ్ వద్ద చెత్త పేరుకుపోయే ప్రదేశాన్ని సందర్శించిన కమిషనర్, అక్కడ చెత్త పారవేతను అరికట్టేందుకు స్థానికులు స్వచ్ఛందంగా సీసీటీవీ కెమెరాలు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ వ్యవస్థ ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. పరిశుభ్రమైన పరిసరాల నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొంటూ, పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా కొనసాగించాలని అధికారులకు సూచించారు.

మరో గార్బేజ్ వల్నరబుల్ పాయింట్‌ను పరిశీలించిన కమిషనర్, ఖాళీ స్థలాల్లో చెత్త పారవేతను అడ్డుకునేందుకు భూ యజమానులు తమ స్థలాలకు కంచెలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీనివల్ల అక్రమ డంపింగ్‌కు అడ్డుకట్ట పడటంతో పాటు పరిసరాల పరిశుభ్రత మెరుగుపడుతుందని తెలిపారు.ఉదాసీన్ ల్యాండ్ ప్రాంతంలో నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల అక్రమ డంపింగ్‌పై సమీక్ష నిర్వహించిన కమిషనర్, సమస్యపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం సంపూర్ణ అపార్ట్‌మెంట్స్‌లో నివాసితుల సంక్షేమ సంఘం చేపడుతున్న గ్రీన్ లీఫ్ కంపోస్టింగ్ కార్యక్రమాన్ని పరిశీలించి, సమాజ స్థాయిలో సుస్థిర వ్యర్థ నిర్వహణకు వారు చేస్తున్న కృషిని ప్రశంసించారు.

ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాలు, మున్సిపల్ యంత్రాంగం సమన్వయంతోనే పరిశుభ్రమైన కాలనీలు సాధ్యమవుతాయని కమిషనర్ పేర్కొన్నారు. సుస్థిర వ్యర్థ నిర్వహణ విధానాలను ప్రోత్సహిస్తూ పరిశుభ్రమైన, పచ్చదనంతో నిండిన, నివాసయోగ్యమైన సైబరాబాద్ నిర్మాణమే లక్ష్యమని సీఎంసీ స్పష్టం చేసింది.

# బౌరంపేటలో చోరుల బీభత్సం

## అర్ధరాత్రి రెండు ఇళ్లపై దాడి.. నగదు, బంగారం ఊడ్చుకెళ్లిన దుండగులు



సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ ఐన దృశ్యం

సైబరాబాద్ (బిఎన్ఎస్): దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బౌరంపేట కాలనీలో అర్ధరాత్రి చోరులు బీభత్సం సృష్టించారు. గుర్తుతెలియని దుండగులు రెండు ఇళ్లను లక్ష్యంగా చేసుకుని తాళాలు పగులగొట్టి నగదు, బంగారు ఆభరణాలు అపహరించారు. ఒక ఇంట్లో అల్మారాను ధ్వంసం చేసి రూ.45 వేల నగదును ఎత్తుకెళ్లగా, మరో ఇంట్లో 18 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ.30 వేల నగదును దోచుకెళ్లారు.

తెల్లవారుజామున ఇంటికి వచ్చిన యజమానులు తాళాలు పగిలి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న దుండిగల్ పోలీసులు క్లూస్ టీంతో కలిసి ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు రెండు వేర్వేరు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

**పోలీసుల సూచనలు**

ఇళ్లను ఖాళీగా వదిలి వెళ్లే సమయంలో డబుల్ లాక్ ఏర్పాటు చేయాలని, విలువైన వస్తువులు, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100కు డయల్ చేసి సమాచారం అందించాలని కోరారు.

# అక్రమ సంబంధం నేపథ్యంలో దారుణ హత్య: భార్యాభర్తల అరెస్ట్



చిలకలూరిపేట, 11జూన్(బిఎన్ఎస్) : అక్రమ సంబంధం నేపథ్యంలో ఒక వ్యక్తిని అతి క్రూరంగా కొట్టి, గొంతుకు తాడు బిగించి హత్య చేసిన కేసులో నిందితులను రూరల్ పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. గురువారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరసరావుపేట డిఎస్పీ వి. హనుమంతరావు కేసు వివరాలను వెల్లడించారు.

**కేసు వివరాలు, నేపథ్యం పోలీసుల కథనం ప్రకారం**

పేట మండలం పసుమర్రు గ్రామానికి చెందిన షేక్ జాకీర్ హుస్సేన్ (45) టింకరింగ్ పనులు చేసుకుంటూ ఉంటాడు. అతనికి పట్టణానికి చెందిన షేక్ కాలేషా భార్య మనీషాతో అక్రమ సంబంధం ఏర్పడింది. ఈ విషయమై కాలేషా, మనీషా దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. గొడవల కారణంగా వారు తమ సొంత ఇల్లు వదిలి రెడ్ల బజార్‌లో అద్దె ఇంట్లోకి మారినప్పటికీ, జాకీర్ హుస్సేన్ – మనీషాల అక్రమ సంబంధం కొనసాగింది.దీనితో విసిగిపోయిన కాలేషా.. "జాకీర్ వల్ల మన కాపురం పాడవుతోంది, వాడిని చంపేస్తే మనం సంతోషంగా ఉండొచ్చు" అని భార్యను ఒప్పించాడు. భర్త పథకానికి మనీషా కూడా అంగీకరించింది. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదీన మనీషా తన ఫోన్ ద్వారా జాకీర్ హుస్సేన్‌ను పిలిపించింది. అనంతరం భార్యాభర్తలిద్దరూ కలిసి జాకీర్‌ను దారుణంగా కొట్టి, తాడుతో గొంతు నులిమి హత్య చేశారు. సాక్ష్యాలను దాచిపెట్టేందుకు మృతదేహాన్ని వేలూరు – జాలాది రోడ్డు పక్కన పడవేసి పరారయ్యారు.

**పోలీసుల దర్యాప్తు – నిందితుల అరెస్ట్**

ఈ నెల 2వ తేదీన మృతదేహాన్ని చూసిన మృతుడి భార్య షేక్ షఫియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు (Cr. No. 60/2026 u/s 103(1), 238 r/w 3(5) BNS). పల్నాడు జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు ఆదేశాల మేరకు, నరసరావుపేట డిఎస్పీ పర్యవేక్షణలో చిలకలూరిపేట రూరల్ సీఐ బి. సుబ్బానాయుడు, ఎస్ఐ జి. అనిల్ కుమార్ మరియు సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. ఎటువంటి క్లూస్ లేని ఈ కేసును పోలీసులు సాంకేతిక ఆధారాలతో ఛేదించారు. గురువారం (జూన్ 11) మధ్యాహ్నం 3 గంటల సమయంలో చిలకలూరిపేట మండలం, మానుకొండవారిపాలెం గ్రామ పరిధిలో నిందితులైన షేక్ కాలేషా @ కాలేషా వలి (35), షేక్ మనీషా (31)లను పోలీసులు అరెస్ట్ చేశారు.నిందితుల నుంచి హత్యకు ఉపయోగించిన రక్తం తడిచిన చెక్క, తాడుతో పాటు నిందితుల ఫోన్లు, మృతుడిని తరలించేందుకు వాడిన టాటా ఏస్ (TATA Ace) వాహనం, మృతుడి స్కూటీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**పోలీస్ సిబ్బందికి అభినందనలు**

క్లిష్టమైన ఈ హత్య కేసును ఎంతో చాకచక్యంగా ఛేదించిన చిలకలూరిపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. సుబ్బానాయుడు, ఎస్ఐ శ్రీ జి. అనిల్ కుమార్ మరియు పోలీస్ సిబ్బందిని పల్నాడు జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# రేపు విశాఖకు నారా లోకేష్.



అమరావతి, జూన్ 11(బిఎన్ఎస్): విశాఖలో జరగనున్న డిజీ100ఎక్స్ ఏపీ' రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొనున్నారు. శుక్రవారం సాయంత్రం 5 గం.లకు విశాఖపట్నం రాడిసన్ బ్లూ రిసార్ట్ లో జరిగే 'డిజీ100ఎక్స్ ఏపీ' సదస్సులో పాల్గొని పరిశ్రామికవేత్తలతోను, సంస్థల యజమానులతోనూ సమావేశం కానున్నారు.

# అందరికీ సురక్షిత వీధులే లక్ష్యం

## సైబరాబాద్‌లో రహదారి భద్రతపై ప్రత్యేక సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న సిఎంసి కమిషనర్ జి సృజన.

సైబరాబాద్, (బిఎన్ఎస్): వేగంగా అభివృద్ధి చెందుతున్న సైబరాబాద్‌లో ప్రజా భద్రత, సురక్షిత రవాణా వ్యవస్థల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ సైబరాబాద్ పోలీస్ ఆధ్వర్యంలో నోవోటెల్ హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్‌లో "క్రియేటింగ్ సేఫర్ స్ట్రీట్స్ ఫర్ ఆల్ ఇన్ సైబరాబాద్" అంశంపై ప్రత్యేక శిక్షణా సదస్సు నిర్వహించారు.

సదస్సుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పట్టణ ప్రణాళిక నిపుణులు, ఇంజినీర్లు, ట్రాఫిక్ నిర్వహణ సంస్థల ప్రతినిధులు, పౌర పరిపాలన అధికారులు పాల్గొని సురక్షితమైన, ప్రజా కేంద్రిత వీధుల అభివృద్ధిపై చర్చించారు.

పాదచారుల మౌలిక సదుపాయాల విస్తరణ, జంక్షన్‌ల ఆధునీకరణ, వేగ నియంత్రణ చర్యలు, సైకిల్ వినియోగదారులు మరియు ఇతర రహదారి వినియోగదారుల భద్రతకు అవసరమైన చర్యలపై నిపుణులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ పరిష్కారాలు, ట్రాఫిక్ నిర్వహణ, చట్ట అమలు సంస్థల సమన్వయంతో సమర్థవంతమైన రవాణా వ్యవస్థను రూపొందించాల్సిన అవసరాన్ని సదస్సు నొక్కిచెప్పింది.

ఈ సందర్భంగా కమిషనర్ జి. సృజన మాట్లాడుతూ, ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు సంస్థాగత సామర్థ్యాన్ని పెంపొందించడమే కాకుండా వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేస్తాయని తెలిపారు. రహదారి భద్రత, సమ్మిళిత రవాణా, సుస్థిర పట్టణాభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలకు సీఎంసీ పూర్తి మద్దతు అందిస్తుందని స్పష్టం చేశారు.

సైబరాబాద్‌లో మరింత సురక్షితమైన, అందుబాటులో ఉండే, ప్రజల అవసరాలకు అనుగుణమైన వీధుల నిర్మాణమే లక్ష్యంగా అన్ని భాగస్వామ్య సంస్థలు కలిసి పనిచేయాలని సదస్సు పిలుపునిచ్చింది.

ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్, ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు, సీఎంసీ జోనల్ కమిషనర్లు, శాఖాధిపతులు, డిప్యూటీ కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాలం చెల్లిన వస్తువులు అమ్ముతున్న "సూపర్ మార్కెట్లపై" అధికారుల చర్యలేవి..!!

## డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్.



కడపజిల్లా(బిఎన్ఎస్)జూన్ 11:జమ్మలమడుగు పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులోని ప్రముఖ సూపర్ మార్కెట్ యాజమాన్యాలు కాలం చెల్లిన వస్తువులను అమ్ముతున్నట్లు ప్రజలు వాపోతున్నారని,అటువంటి వాటిపైన అధికారులు

తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల. శివకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. జమ్మలమడుగు పట్టణంలోని ప్రముఖ సూపర్ మార్కెట్ నందు కాలం చెల్లినవస్తువులు పెట్టి అమ్ముతున్నారని

అన్నారు.ప్రజలు నమ్మకంతో వస్తువుల పైన ముద్రించిన గడువు తేదీలు చూడకుండా ఇంటి అవసరాలకు ఉపయోగపడే వస్తువులు కొంటున్నారని,కానీ సూపర్ మార్కెట్ యాజమాన్యాలు వారి నమ్మకాల పై వ్యాపారం చేస్తూ ప్రజల ఆదాయంతో డబ్బులు అర్జిస్తూ,లాభాలు పొందుతూ వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు.అధికారులు నిత్యం తనిఖీలునిర్వహించకపోవడంతోనే స్టాక్ తేదీలు నిల్వలు చూడకపోవడంతో ఇటువంటి సంఘటనలుజరుగుతున్నాయని అన్నారు.అధికారులు కాలం చెల్లిన వస్తువులను పెట్టి అమ్ముతున్న సూపర్ మార్కెట్ ల పై తనిఖీలు నిర్వహించి చర్యలు చేపట్టాలని డివైఎఫ్ఐ గా డిమాండ్ చేస్తున్నామని అన్నారు..

# దేశ ప్రధాని నరేంద్ర మోడీకి జమ్మలమడుగు కాంగ్రెస్ ఇన్చార్జి సింగం.శివ మోహనరెడ్డి ప్రశ్నల వెల్లువ..!!



కడపజిల్లా(బిఎన్ఎస్)మే11:

అయ్యా మోడీ సార్..

1. భారతదేశంలో ఉన్న బ్లాక్ మనీ విదేశీ బ్యాంకుల్లో ఉందని అది తీసుకువచ్చి ప్రతి భారతీయుని వారి,వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల నందు రూ 15 లక్షలు వేస్తానని చెప్పినారు.. ఏమయింది..?

2. ఆదాని ప్రపంచంలోనే నంబర్ వన్ కోటేశ్వరుడు ఎలా అయ్యారు.?

3. ఆదానీ పై కేసులు ఎత్తివేయడానికి మీరు ట్రంప్ కి బానిసగా మారటం నిజం కాదా?

4. పెట్రోల్ డీజిల్ ని జిఎస్టి పరిధిలోనికి ఎందుకు తీసుకు రావట్లేదు.

5. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన మోడీ ఇప్పుడు ఎక్కడ, ఎప్పుడు,ఇచ్చారు.?

6. బేటి పడావో,బేటి బచావో అన్నారు.అది ఇప్పుడు ఎక్కడ.?

7. స్వచ్ఛత,పరిశుభ్రత అన్నారు ఎక్కడ.?


8. డాలర్ వేల్యూ 40 రూపాయలకు తగ్గిస్తానన్నారు ఇప్పుడు 98 రూపాయలు అయి కూర్చుంది.?

9. ఎల్.కె అద్వానీ,మురళీ మనోహర్ జోషి వయసు 75 సంవత్సరాలు నిండింది అని మీరు రాజకీయాలకు పనికిరారు అని వారిని ప్రక్కన పెట్టినారు.మరి మోడీ మీకు 76 సంవత్సరాలు నిండిన విషయం గుర్తులేదా.?

10. ఇప్పటికీ నేషనల్ లెవెల్ లో 40 సార్లు వరకు పేపర్లు లీకేజీ జరిగింది. అనేక మందివిద్యార్థులు ఆత్మహత్యలుచేసుకున్నారు.మీరు 15 సంవత్సరాలకి ఇంటి నుంచి వెళ్లిపోయి పెద్ద, పెద్ద విద్యాసంస్థలలో చదువుకోలేదుఅందువల్ల ఆబాధ మీకు తెలియదు.?

అంటూ కడపజిల్లా జమ్మలమడుగు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి సింగం శివ మోహన్ రెడ్డి ప్రశ్నించారు.

# పెంటగాన్‌లో 'లాక్‌డౌన్'.. ఏం జరిగిందంటే!



ఇంటర్నెట్ డెస్క్: అమెరికా–ఇరాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ అమెరికా రక్షణశాఖ ప్రధాన కార్యాలయం 'పెంటగాన్'లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ప్రమాదకర పదార్థాలున్నట్లు అలారం వ్యవస్థ అప్రమత్తం చేయడంతో అందులోని పలు అంతస్తులు, కారిడార్‌లలో లాక్‌డౌన్ విధించారు. మరికొన్నింటిని ఖాళీ చేయించారు. ఈ ఘటనను అగ్నిమాపక, అత్యవసర వైద్య సేవల విభాగాలు పర్యవేక్షిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

పెంటగాన్ ప్రతినిధి సీన్ పార్నెల్ స్పందిస్తూ.. గాలి నాణ్యతకు సంబంధించిన ఒక సమస్యను ఇక్కడి వ్యవస్థలు గుర్తించాయన్నారు. దాని తీవ్రతను నిర్ధరించే వరకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభావిత ప్రాంతంలో అత్యవసర నిబంధనలు (ఎక్కడివారు అక్కడే ఉండాలనే) ఆదేశాలు ఇచ్చామని, అందులో ఉన్నవారికి సాయం చేసేందుకు ప్రత్యేక సహాయక బృందాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

# కూకట్‌పల్లి తహసీల్దార్ అశోక్ కుమార్‌కు ఘన సన్మానం

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి : పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ


పీఏసీ చైర్మన్ గాంధీని కలిసిన తహసీల్దార్ అశోక్.

కూకట్‌పల్లి, బిఎన్ఎస్: కూకట్‌పల్లి తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అశోక్ కుమార్‌ను పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పూలబొకేతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వివేకానంద నగర్‌లోని కార్యాలయంలో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీలో తహసీల్దార్ అశోక్ కుమార్, ఆర్ఐ అగస్త్య పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. అలాగే ప్రజల నుంచి వచ్చే సమస్యలను వేగంగా పరిష్కరించి, రెవెన్యూ సేవలను మరింత పారదర్శకంగా అందించాలని కోరారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన అశోక్ కుమార్‌కు విజయవంతమైన పదవీకాలం ఉండాలని ఆకాంక్షిస్తూ గాంధీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక నాయకులు, అధికారులు హాజరయ్యారు.